

ప్రాణం పోశారు

- పొంగిన వాగు.. కొట్టుకుపోయిన కారు
- ప్రవాహంలో అడ్డుకున్న వెదురు పొదలు
- స్థానికుల సాహసంతో నిలిచిన ఐదు ప్రాణాలు
- కోయమాధవరంలో ఘటన

ఏలూరు/వేలేరుపాడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు కొండ వాగులు పొంగి పొర్లడంతో కారులో కొట్టుకు పోతున్న ఐదుగురి ప్రాణాలను వెదురు పొదలు, స్థానికుల సాహసం కలగలపి నిలిపాయి. రాజమహేంద్రవరం నుంచి వేలేరుపాడు మండలం రుద్రంకోటకు గడ్డం సాయికుమార్ ఇద్దరు కుమారులు కుందనకుమార్, జగదీష్‌కుమార్, తల్లి జ్యోతి, మేనమామ రామారావుతో కలిసి కారులో బయలు దేరారు. గురువారం మధ్యాహ్నం కోయమాధవరం- అల్లూరు నగరం మధ్య నీటి ప్రవాహం కనిపిస్తుండగా వాగు దాటే ప్రయత్నం చేశారు. ఈ లోగా ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వేగంగా వచ్చి కారును కిందకు తోసుకుపోయింది. కారులోవున్న ఐదుగురు రక్షించండి అంటూ కేకలు వేయడంతో ఆ వైపు వెళుతున్న స్థానిక యువకుడు విని తక్షణం తన చేతిలో ఉన్న పొడవాటి తాడు సాయంతో వారిని రక్షించే ప్రయత్నం చేశారు. ఈలోగా కారు కాస్త ముందుకు వెళ్లి వెదురు పొదును ఢీకొట్టి నిలిచిపోయింది. కారులో ఉన్న వారంతా వెదురుపొద సాయంగా పైకి ఎగబాకేందుకు ప్రయత్నించారు. ఈలోగా జగదీష్‌కుమార్ వాగు ఉధృతికి దిగువకు కొట్టుకుపోయి, అతను ఇంకొక వెదురు పొదలో చిక్కుకున్నాడు. ఈలోగా తాడు విసిరిన యువకుడే గ్రామస్థులను క్షణాల్లో పిలుచుకు వచ్చి అందర్ని రక్షించే ప్రయత్నం చేశారు. ఒకవేళ అతను తక్షణం స్పందించి సాహసం చేయకపోయి ఉంటే పెను ప్రాణనష్టం సంభవించి ఉండేది. తమ వద్ద ఉన్న తాడుసాయంతో వెదురుపొదల్లోకి ఎగ బాకడంతోనే కొంతలో కొంత వారు ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నం చేయగా, ఈలోపే కోయమాధవరం గ్రామస్థులు చేసిన సాహసానికి ఐదుగురి నిండు ప్రాణాలు దక్కాయి. క్షణం ఆలస్యం చేయకుండా అందరిని ఒడ్డుకు చేర్చి అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు. సాయి కుమార్ కుటుంబం యావత్తు గురువారం ప్రాణాలతో బయటపడటానికి కోయమాధవరం గ్రామస్థుల సాహసమే ఓ తార్కాణం.

సీఎం చొరవ, ఎంపీ, ఎమ్మెల్యేలు అప్రమత్తం

కారు కొట్టుకుపోయిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం చంద్రబాబు రంగంలోకి దిగి ఓ వైపు ఎండీఆర్ఎఫ్ బృందాలను ఇంకోవైపు ఏలూరు జిల్లా కలెక్టర్‌ను అప్రమత్తం చేశారు. కారులో చిక్కుకుపోయిన వారిని తక్షణ రక్షించే దిశగా రెండు హెలికాప్టర్‌లతో సహాయ చర్యలు చేపట్టేందుకు రంగంలోకి దిగాల్సిందిగా ఆదేశించారు. దీంతో సీఎంవోలో క్షణక్షణానికి సహాయ చర్యలపై ఆరా తీసింది.

జేసీబీ సాయంతో ముగ్గురిని కాపాడారు



జీలుగుమిల్లి : వరద ఉధృతికి రౌతుగూడెం బ్రిడ్జి వద్ద కాల్వ పొంగి పొర్లింది. గుబ్బల మంగమ్మ ఆలయ ప్రాంతం నుంచి సమీప కొండ వాగులు ప్రవాహంతో వరద ముంచెత్తింది. గ్రామానికి చెందిన కారం రాము, గెడ్డం శ్రీరామూర్తి, వి.వెంకటస్వామి పొలం పనుల నిమిత్తం వెళ్లి వరదలో చిక్కుకుపోయారు. స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారిని రాత్రి సమయంలో జేసీబీ సాయంతో సురక్షిత ప్రాంతానికి తీసుకుని వచ్చారు. అలాగే రౌతుగూడెం సమీప బెడదనూరు కాల్వ వద్ద 20 మంది విద్యార్థుల్ని నిలిపివేశారు. అనంతరం రెడ్డిగణపవరం వాసులు తల్లిదండ్రులు కలసి ట్రాక్టరుపై చిన్నారుల్ని ఇళ్లకు తీసుకెళ్లారని వీఆర్వో విజయశాంతి చెప్పారు.

వాగులో చిక్కుకున్న స్కూల్ బస్సు



బుట్టాయగూడెం : జంగారెడ్డిగూడెం ఢిల్లీ పబ్లిక్ స్కూలుకు చెందిన బస్సు విద్యార్థులను ఇళ్లకు చేర్చేందుకు గురువారం బుట్టాయగూడెం మండలంలో దింపేందుకు బయలు దేరింది. బుట్టాయగూడెం దాటుతుండగా తాడితోట పొలాల మధ్యలోని పంట కాలువ ఒక్కసారిగా పొంగింది. కాలువ ఉధృతిని గుర్తించని డ్రైవర్ బస్సును ముందుకు తీసుకువెళ్ళేందుకు ప్రయత్నించగా మధ్యలో నిలిచిపోయింది. ఆ సమయంలో బస్సులో ఎనిమిది మంది పిల్లలు ఉన్నారు. బస్సు కాలువలో ఆగిపోవడాన్ని గుర్తించిన స్థానికులు, మరికొందరు విద్యార్థులు ధైర్యం చేసి వాగులో దిగి బస్సును బయటకు నెట్టడంతో ముందుకు కదిలింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పిల్లలు అందరూ సురక్షితంగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఏజెన్సీలో వాగులు పొంగిన విషయాన్ని తెలుసుకోకుండా డ్రైవర్ బస్సును కాలువ దాటించడానికి ప్రయత్నం చేయడాన్ని అందరూ తప్పుబడుతున్నారు. వాగుల వద్ద జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.



- హెలీకాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు..

గురువారం ఉదయం నుంచి కురిసిన అతి భారీ వర్షాల కారణంగా పెదవాగు ప్రాజెక్టు కు భారీగా వరద పోటెత్తింది. ఈ కారణంగా తెలంగాణలోని నారాయణపురం గ్రామ సమీపంలోని కట్ట మైసమ్మ ఆలయం వద్ద పదడుగుల మేర రహదారిపై వరద నీరు ప్రవహించింది. అశ్వారావుపేట వైపు నుంచి వేలేరుపాడు వైపు వస్తున్న వాహనదారులు పెద వాగు బ్రిడ్జిపై ఎటూ వెళ్లే వీలు లేక చిక్కుకుపోయారు. ఇందులో కొన్ని ఆటోలు, మోటర్ సైకిళ్లపై వచ్చిన వారు వరదలో చిక్కు కున్నారు. మరికొందరు కట్ట మైసమ్మ ఆలయంలో ఆశ్రయం పొందగా వరద పెరిగి ఆలయం సగానికిపైనే మునిగిపోవడంతో అక్కడ తలదాచుకున్న వారు ఆలయం షెడ్ల పైకి ఎక్కారు. ఈలోగా వరద సమాచారంతో పోల వరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అక్కడికి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్‌కు పరిస్థితి వివరించి 30 మందికి పైనే వరదలో చిక్కుకున్నారని హెలికాప్టర్ల ద్వారా వారిని రక్షించే ప్రయత్నం చేయాలని కోరారు. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్థానికులు సమాచారం అందించడంతో కాపాడే ఏర్పాటు చేస్తామని చెప్పారు. మరోవైపు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, కలెక్టర్, ఎస్పీలను అప్రమత్తం చేశారు. ఆ తర్వాత ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో రెండు హెలికాప్టర్లు ఘటనా స్థలానికి చేరుకుని తాళ్ళ ద్వారా వరదలో చిక్కుకున్న వారిని తరలించే ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రానికి 25 మంది సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మిగిలిన వారిని హెలికాప్టర్ల ద్వారా తరలిస్తున్నారు. వరదలో చిక్కుకున్న వారిలో కోయిదా పీహెచ్‌సీ సిబ్బందితో పాటు, రుద్రమ్మకోట, వేలేరుపాడు తదితర గ్రామాల ప్రజలు ఉన్నారు. వారందరూ సురక్షితంగా బయట పడటంతో బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. జంగారెడ్డి గూడెం ఆర్డీవో పెద్దయ్య, వేలేరుపాడు మండల అధికారులు సైతం పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వచ్చారు.

గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద చిక్కుకున్న భక్తులు



ఆలయం వద్ద వరద ఉధృతి

బుట్టాయగూడెం : గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద ఎర్ర ఎక్కుడు వాగు పొంగి అమ్మ వారిని వరద నీరు ముంచెత్తింది. ఆలయానికి వెళ్లే మెట్ల దారిలో సైతం వరద నీరు ప్రవహిస్తోంది. అమ్మ వారి దర్శనానికి వచ్చి వాగులు పొంగడంతో ఆలయం వద్దే చిక్కుకు పోయిన 500 మంది భక్తులను గురువారం సాయంత్రానికి వాగులు తగ్గుముఖం పట్టాక ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ట్రాక్టర్లపై సురక్షితంగా బయటకు తరలించి కామవరం పాఠశాల భవనం, పంచాయతీ కార్యాలయంలో వసతి కల్పించారు మరో వైపు అమ్మవారి ఆలయానికి ఎవరూ వెళ్ళకుండా కామవరం వద్ద గేటును మూసివేశారు.

అధికారులు అప్రమత్తం

ఏలూరు సిటీ, జూలై 18 : ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేసినట్టు కలెక్టర్ ప్రకటించారు. జిల్లాలో వరద పరిస్థితిపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాలో వరద పరిస్థితిపై సమీక్షించారు. 'ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో ముంపు ప్రమాదం వున్న గ్రామాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలి. వరద దృష్ట్యా తెలంగాణ ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని వరద నీటిని ఎప్పటికప్పుడు దిగువ ప్రాంతాల విడుదల చేయాలి. అదే సమయంలో ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలి. పౌరసరఫరాల శాఖాధికారులు ముంపు మండలాల ప్రజలకు పంపిణీ నిమిత్తం అవసరమైన నిత్యావసర సరుకులు ఆయా మండల కేంద్రాలకు తరలించాలి. గజ ఈతగాళ్ళు, లైఫ్ జాకెట్లు, లైఫ్‌బోట్లును అందుబాటులో ఉంచాలి'.. అని ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల మూలంగా తలెత్తే పరిమాణాలను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ఠ ప్రణాళికతో సిద్ధంగా ఉందని కలెక్టర్ వెట్రిసెల్వి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కి వివరించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి భారీ వర్షాలు, వరదలు, వైద్యం, తాగునీటి తదితర అంశాలపై సమీక్షించారు. మరోవైపు భారీ వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ సూచించారు.

విద్యుత్ శాఖ అప్రమత్తం

భారీ వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్ వైర్లను తాకవద్దని, ఏదైనా విద్యుత్ అంతరాయం, ఇతరత్రా సమస్యలు ఏర్పడితే కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్ రాజు కోరారు.



ఏలూరులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు

వర్షాలు, వరదల కారణంగా ప్రజల సౌకర్యార్థం జిల్లాలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబర్ 1800 233 1077. ఏలూరు ఆర్డీవో కార్యాలయం 08812-232044, జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం 944090 2926, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యాలయం 94910 30713 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.


వర్షాలకు జాగ్రత్తగా ఉండండి : ఎస్పీ సూచన

ఏలూరు క్రైం : జిల్లావ్యాప్తంగా అధిక వర్షపాతం నమోదు అవుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొమ్మి ప్రతాప్ శివకిషోర్ కోరారు. ఉరుములు, మెరుపులు పడుతున్న సమయాల్లో పచ్చని చెట్ల కింద ఉండకూడదని, ఆ సమయంలో సెల్‌ఫోన్లను వినియోగించవద్దని కోరారు.

కుండపోత

క్షణక్షణం భయం.. స్తంభించిన జనజీవనం

- పొంగిన కొండవాగులు.. వేలేరుపాడు అతలాకుతలం
- ఏ క్షణమైన పెదవాగు కట్ట తెగే ప్రమాదం
- కొట్టుకుపోయిన రోడ్లు.. వంతెన అప్రోచ్‌లు
- బిక్కుబిక్కుమంటున్న పది గ్రామాల ప్రజలు
- ఊళ్లను ఖాళీ చేయించే దిశగా అధికారులు
- ఏజెన్సీలో వాగుల ఉధృతి.. నిలిచిన రాకపోకలు



పెదవాగు ప్రాజెక్టు కట్టపై కుడికాల్వ వైపు పొంగిపొర్లుతున్న వరద



రామవరంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెదవాగు వరద

ఏలూరు సిటీ/వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం, జూలై 18 : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ఉధృతం కావడంతో జిల్లావ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవడంతో వేలేరుపాడు మండలంలో జల విలయం తాండవించింది. క్షణాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రహదారులన్ని నీట మునిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎద్దు వాగు బ్రిడ్జిపై నుంచి కొన్ని మీటర్ల ఎత్తున వరద ప్రవహించటంతో వరద తీవ్రతకు వంతెనకు ఇరు వైపులా నిర్మించిన అప్రోచ్ రోడ్డు కొట్టుకు పోయి కేవలం వంతెన మాత్రం మిగిలింది.

ప్రమాదంలో పెదవాగు

పెదవాగు ప్రాజెక్టు ఎగువ భాగంలోని గుబ్బల మంగమ్మ అటవీ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తీవ్రస్థాయిలో వరద పోటెత్తింది. ఆరు మీటర్ల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు బుధవారానికే ఐదు మీటర్ల నీటిమట్టం చేరుకుంది. గురువారం కురిసిన అతి భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టుకు కనివినీ ఎరుగని రీతిలో వరద వచ్చి పడింది. గురువారం మధ్యాహ్నానికే అధికారులు ప్రాజెక్టు మూడు గేట్లకు రెండింటిని మాత్రమే తెరవగలిగారు. మూడో గేటు తెరిచేందుకు నానా అగచాట్లు పడ్డారు. వరద తీవ్రత అధికమై ప్రాజెక్టు కట్ట మీద నుంచి నాలుగుచోట్ల వరద పొంగిపొర్లింది. చివరకు అధికారులు మూడో గేటు తెరిచేందుకు శతవిధాలా ప్రయత్నించి సఫలమయ్యారు. 17 వేల క్యూసెక్కుల వరదనీటిని దిగువన ఉన్న పెదవాగులోకి వదిలివేశారు. ప్రాజెక్టుకు అంతకంతకు వరద పెరుగుతూనే ఉండటంతో ఆ ప్రభావం కట్టపైపడి పలు చోట్ల గండిపడే ప్రమాదం ఏర్పడింది. ఏ క్షణమైనా ప్రాజెక్టు కట్ట తెగిపోనుందనే సమాచారంతో అటు తెలంగాణ, ఇటు ఆంధ్రా అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టుకు దిగువనే ఉన్న గుమ్మడిపల్లి గ్రామాన్ని ఖాళీ చేయించే దిశగా కొత్తగూడెం భద్రాద్రి జిల్లా కలెక్టర్ చర్యలు ప్రారంభించగా మండలంలోని 10 గ్రామాల ప్రజలను స్థానిక రెవెన్యూ అధికారులు ఫోన్ల ద్వారా అప్రమత్తం చేసి వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళాలని సూచించారు. ప్రాజెక్టు దిగువ భాగాన ఉన్న కమ్మరగూడెం, అల్లూరినగర్, కోయమాధారం, ఒంటిబండ, ఊటగుంపు, రామవరం, గుళ్ళవాయి, గ్రామాల్లోకి వరద పోటేత్తింది. వాగులను తలపిస్తూ ఈ గ్రామాల్లో వరద ప్రవహించటంతో కొన్ని ఇళ్ళు నేలమట్టమయ్యాయి. కమ్మరగూడెంలోకి పెద వాగు వరద గ్రామాన్ని ముంచి వేయడంతో గ్రామస్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సమీపంలోని కొండ గుట్టపైకి పరుగెత్తి ప్రాణాలు దక్కించుకున్నారు. పెదవాగు ఉధృతి కారణంగా అల్లూరినగర్, రెడ్డిగూడెం గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపైకి వరద ఉధృతంగా ప్రవహించటంతో రోడ్లు కొట్టుకుపోయాయి. వేలేరుపాడు, రుద్రమ్మకోట రహదారిపై వరదతో రాకపోకలు నిలిచాయి. వేలేరుపాడు, కోయిద రహదారి మధ్య అనేకచోట్ల రహదారికి గండ్లుపడ్డాయి. నాళ్ళవరం కాలనీ సమీపంలో కొండ వాగులు పొంగటంతో పశువులు వరదలో కొట్టుకు పోయాయి. మొత్తంగా వేలేరుపాడు మండలాన్ని భారీ వర్షం అతలకుతలం చేయడంతో కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో ఉదయం నుంచి సరఫరా నిలిచిపోయింది.

పోటెత్తిన గుండేటి వాగు

కుక్కునూరు, దాచారం గ్రామాల మధ్య గుండేటివాగు పోటెత్తడంతో లో లెవిల్ కాజ్‌వే నీట మునిగి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు నల్లకుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. కివ్వాక, చిరవల్లి ప్రధాన చెరువులకు భారీగా వరద నీరు చేరుతుండడంతో చెరువు కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున రైతాంగం అప్రమత్తమై తూములు తెరచి వరద నీటిని బయటకు పంపే ప్రయత్నం చేస్తున్నారు.

పొంగుతున్న కొండవాగులు

పోలవరం మండలం గుంజవరం, పేడ్రాల కాల్వలు పొంగుతున్నాయి. కొండవాగుల జలాలు పొంగి గుంజవరం కల్వర్టుపై నుంచి ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు రెండు గంటలు నిలిచిపోయాయి. మెత్తప్పకోట, సున్నాలగండి వాగుల జలాలు వింజరం గోవిందరాజుల చెరువులోకి ప్రవహిస్తున్నాయి. ఇటుకలకోట ఇసుక కాల్వ జలాలు కడమ్మ కాల్వ ద్వారా ప్రవహించి కడెమ్మ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. కొవ్వాడ కాల్వ జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. కొవ్వాడ కాల్వ జలాల తాకిడికి పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ దిగువన పట్టిసీమ ఫెర్రీ రేవు వద్ద కోతకు గురైన ప్రాంతం మరింత కోతకు గురవుతోంది. గోదావరి నీటిమట్టం పెరగడంతో పట్టిసీమ శివక్షేత్రం వద్ద ఇసుక తిన్నెలు నీట మునుగుతున్నాయి. గూటాల, పోలవరం, పట్టిసీమ, కొత్తపట్టిసీమ గ్రామాల్లో ఏటిగట్టుకి దిగువన ఉన్న నివాసాల వద్ద డ్రెయినేజీ వ్యవస్థ లేక నివాసాల్లోకి వర్షం నీరు చేరి ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. పాత పోలవరం నుంచి యడ్లగూడెం వరకు నెక్లెస్ బండ్ దిగువన గ్రామం వైపు మేజర్ డ్రెయినేజీ లేకపోవడంతో నివాసాల్లోకి వర్షం నీరు చేరి ప్రజలు అవస్థలకు గురయ్యారు. నూతనగూడెం నుంచి యడ్లగూడెం వరకు నెక్లెస్ బండ్ బంకమన్ను కిందకు రోడ్డుపైకి జారి వాహనదారులు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు.



వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఎద్దువాగు వంతెన అప్రోచ్ రోడ్డు



కన్నాపురం పడమట వాగు వద్ద నిలిచిపోయిన వాహనదారులు

వాగుల్లో.. వరద ప్రవాహం

బుట్టాయగూడెం : ఏజెన్సీలోని బైనేరువాగు, రెడ్డిగణపవరం జల్లేరువాగు, రౌతుగూడెం కొండవాగు, విప్పలపాడు జల్లేరువాగు, ఎర్రెక్కుడువాగు, కన్నాపురం పడమట వాగు, కేఆర్ పురం తూర్పువాగు, ముంజులూరు కొండవాగు, కామవరం తూర్పు, పడమర కొండవాగులు, పద్మావారిగూడెం, అల్లికాల్వ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రెడ్డిగణపవరం జల్లేరువాగు ఉధృతికి పడమట పాలకుంట తూర్పు భాగాన ఉన్న సుమారు 12 ఇళ్లు వరదనీటిలో చిక్కుకున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నిర్మించిన నిర్వాసిత కాలనీల్లోకి వరదనీరు వచ్చి చేరడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. వాగులు పొంగడంతో ఉద్యోగాలకు వెళ్ళేవారు, వివిధ అవసరాల నిమిత్తం బయటకు వెళ్ళివారు గంటల తరబడి వాగుల వద్దనే నిలిచి పోయారు. వాగుల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రెవెన్యూ, పోలీస్ సిబ్బంది కాపలాగా ఉండి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని పట్టెన్నపాలెం వద్ద జల్లేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జనజీవనం స్తంభించింది. ఏజెన్సీ గ్రామాలకు జంగారెడ్డిగూడెంకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

జీలుగుమిల్లి : అశ్వారావుపేట వాగు, వంకవారిగూడెం, పి.రాజవరం, లంకాలపల్లి వద్ద వాగులు పొంగి రహదారులు పైనుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో పలు గిరిజన గ్రామాల నుంచి మండల కేంద్రానికి రాకపోకలు నిలిచాయి. జీలుగుమిల్లి సమీప అశ్వారావుపేట వాగు వద్ద ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పరిస్థితిని ఆరా తీశారు. రెవెన్యు పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎటువంటి ప్రమాదాలు జరక్కుండా తమ సిబ్బందితో పర్యవేక్షించాలన్నారు.



స్పిల్‌వే వద్ద గోదావరి జలాల విడుదల

పెరిగిన గోదావరి నీటిమట్టం

తెలంగాణలో భారీ వర్షాల కారణంగా గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. కుక్కునూరు, వేలేరుపాడు మండలానికి ఎగువన ఉన్న పెదవాగు ప్రాజెక్టు పూర్తిగా వరద నీటితో నిండిపోయింది. ఇది కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వచ్చే వాగుల ద్వారా గోదావరికి చేరుతోంది. భద్రాచలం వద్ద గురువారం సాయంత్రానికి 18 అడుగుల నీటిమట్టం నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 29.000 మీటర్లు, దిగువన 19.160 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 29.150 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన 18.700 మీటర్లు నమోదైంది. స్పిల్‌వే వద్ద 48 గేట్ల ద్వారా రెండు లక్షల క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఈఈ మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 1,770 క్యూసెక్కులు

పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.680 మీటర్లకు చేరడంతో ఐదు పంపుల నుంచి 1,770 క్యూసెక్కుల వరద జలాలను విడుదల చేసినట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు గురువారం తెలిపారు.

మరో రెండు రోజులు వర్షాలు

గడిచిన 24 గంటల్లో కొయ్యగూడెం మండలంలో 26.8 మి. మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది. ముదినేపల్లి 24.4, జీలుగుమిల్లి 23.4, కుక్కునూరు 22.2, పెదవేగి 20.4, దెందులూరు 18.2, వేలేరుపాడు 17, జంగారెడ్డిగూడెం 16.2, కామవరపుకోట 15.8, ఏలూరు రూరల్ 15.6, కలిదిండి 15.2, ఏలూరు అర్బన్ 12.8, ద్వారకా తిరుమల 11.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా జిల్లాలో గురువారం ఉదయం 8 గంటల తర్వాత ఎడతెరపి లేకుండా భారీగా వర్షాలు కురిశాయి. రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.



ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరు వాగు



చెస్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

21న జిల్లాస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్

భీమవరం అర్బన్, జూలై 18: చదరంగం క్రీడ ద్వారా మేధాశక్తి పెరుగుతుందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా ఈనెల 21న భీమవరంలో ఏఆర్ఆర్ రెసిడెన్సీలో జరిగే జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. జిల్లా చెస్ అసోసియేషన్ వారు చెస్ పోటీలు నిర్వహించడమే కాకుండా పాల్గొనే ప్రతి విద్యార్థికి రూ.600 విలువైన చెస్ కిట్టును అందించడం అభినందనీయం అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలలో జిల్లా తరపున ప్రాతిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 90632 24466 నంబరులో సంప్రదించాలని కోరారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, కార్యదర్శి మైలాపురి మురళి తదితరులు పాల్గొన్నారు.

క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీలో టార్గెట్లు సరికాదు

ఏలూరు రూరల్, జూలై 18: ఇటీవల అధికారులు సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంలో ఉన్న లోపాలను రెవెన్యూ మంత్రి, సీసీఎల్ఏ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా క్రిందిస్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకోకుండా వీఆర్వోలను టార్గెట్ల పేరుతో ఇబ్బందులు పెట్టడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం నుంచి కౌలు కార్డులకు సంబంధించి గతంలో ఉన్న టార్గెట్లు పెంచి, ఇప్పుడు మళ్లీ కౌలురైతుల కార్డులపై టార్గెట్లు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్ల విషయంలోనూ ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. గత పదిహేను రోజుల నుంచి వీఆర్వోల లాగిన్‌లకు పంపినా ధ్రువపత్రాలు అన్నీ క్లియర్ చేయాలని అధికారులు ఒత్తిడితేవడం సమంజసం కాదన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అర్థం చేసుకునే వారు లేకపోవడం బాధాకరమని వీఆర్వోలపై ఒత్తిడి తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు.

నన్నయ ఇన్‌చార్జి వీసీగా ఆచార్య శ్రీనివాసరావు



ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం, జూలై 18: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా ఆచార్య వై.శ్రీనివాసరావును నియమిస్తూ గురువారం ఉన్నతవిద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నన్నయ విశ్వవిద్యాలయం భూగర్భ శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్‌గా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీసీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన వీసీగా బాధ్యతలు స్వీకరించారు. తనపై ఉన్ననమ్మకంతో వర్శిటీ ఇన్‌చార్జి వీసీగా నియమించిన గవర్నర్, యూనివర్శిటీ కులపతి అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. నన్నయ విశ్వవిద్యాయలయం అభివృద్ధికి త్రికరణశుద్ధిగా పనిచేస్తానన్నారు. నన్నయ రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, కాకినాడ ప్రాంగణాలతో బాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల ప్రతినిధులు, అధ్యాపకుల సమష్టి కృషితో విశ్వవిద్యాలయాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు కృషిచేస్తానన్నారు.

వసతి గృహం నుంచి
పారిపోయిన ముగ్గురు బాలికలు

▸▸ సెక్యూరిటీ గార్డు చొరవతో నున్న పోలీసులకు అప్పగింత



రాజేశ్‌కు నగదు బహుమతి అందజేస్తున్న డీసీపీ, సీఐలు

పాయకాపురం, జూలై 18 : ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలు గురువారం నున్న రూరల్ స్టేషన్‌కు చేరారు. ఓ సెక్యూరిటీ గార్డు చొరవ చూపి బాలికలను సురక్షితంగా పోలీసులకు అప్పగించాడు. వెస్ట్ డీసీపీ టి.హరికృష్ణ గురువారం నున్న రూరల్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. డీసీపీ కథనం మేరకు.. విజయవాడ నగరానికి చెందిన ముగ్గురు బాలికలు ఆగిరిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నారు. బాలికలకు అక్కడ ఉండడం ఇష్టం లేక తల్లిదండ్రులను చూడాలని భావించారు. అనుకున్నట్టుగా గురువారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో గుట్టుచప్పుడు కాకుండా వసతి గృహం నుంచి బయటకు వచ్చేశారు. కొంతదూరం నడుచుకుని వచ్చిన తరువాత ఆగిరిపల్లి వద్ద విజయవాడ బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో ఆగిరిపల్లి నుంచి నున్న గ్రామంలోని రిలయన్స్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కూరపాటి రాజేష్ ముగ్గురు బాలికలను గమనించాడు. వారితో పాటు బస్సు ఎక్కిన రాజేష్ బాలికలతో మాట్లాడి వారు పారిపోతున్నారని తెలుసుకుని బస్సు కండక్టర్, డ్రైవర్లకు చెప్పి అప్రమత్తం చేసి నేరుగా నున్న రూరల్ పోలీసు స్టేషన్ వద్ద బస్సు ఆపి ముగ్గురు బాలికలను పోలీసులకు అప్పగించాడు. డీసీపీ బాలికలతో మాట్లాడి విషయం తెలుసుకుని బాలికల తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికలను బాధ్యతగా పోలీసులకు అప్పగించినందుకుగాను డీసీపీ సెక్యూరిటీ గార్డు రాజేష్‌ను సత్కరించి, నగదు బహుమతిని అందజేశారు. బాలికలు వసతి గృహం నుంచి వెళ్లిపోవడానికి గల కారణాలను విచారిస్తున్నామన్నారు. సీఐ దుర్గా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాల గాలింపు

▸▸ నరసాపురం ఎంపీడీవో కోసం నలుగురు డీఎస్పీలతో టీం

▸▸ బెదిరింపు కాల్స్ వచ్చినట్టు సమాచారం

▸▸ ఐజీ పర్యవేక్షణలో కృష్ణా జిల్లా ఎస్పీ దర్యాప్తు

పెనమలూరు, జూలై 18 : నరసాపురం ఎంపీడీవోగా విధుల నిర్వహిస్తూ అదృశ్యమైన మండవ వెంకటరమణారావు కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్టు కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు గురువారం తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు మేరకు రమణారావు మాధవాయిపాలెం ఫెర్రీ విషయంలో రూ.55 లక్షల బకాయిల విషయంలో తీవ్ర ఒత్తిడికి గురైనట్టు తెలిసిందని ఎస్పీ తెలిపారు. అలాగే కొన్ని ఫోన్‌ల నుంచి కాల్స్ వచ్చినట్టు, ఆ కాల్స్ విషయంలో మరింత ఒత్తిడికి గురైనట్టు, కొంత డబ్బును ఆ కాలర్స్‌కు బ్యాంకు ద్వారా జమ చేసినట్టు తెలిసిందన్నారు. వీటన్నింటి మీద పూర్తిస్థాయి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు, గాలింపు చర్యలకు తన ప్రత్యక్ష పర్యవేక్షణలో నలుగురు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 150 మంది సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. ఈ మొత్తం దర్యాప్తును పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సహకారంతో ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ పర్యవేక్షిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. అదృశ్యమైన ఎంపీడీవో సమాచారాన్ని 94407 97400, 94406 27051, 94910 63910 నంబర్లకు తెలియపరచాలని కోరారు.

ఎత్తైన భవనం.. భవనానికి నాలుగు వైపులా కోట మాదిరి బురుజులు.. బర్మా టేకుతో చేసిన సింహద్వారాలు.. తలుపులపై అందంగా చెక్కిన కళ రూపాలు.. విశాలమైన గదులు.. మయసభను తలపించే సెంట్రల్ హాలు.. మైసూర్ ప్యాలెస్‌ను తలపించే అద్భుత నిర్మాణం ఆ భవనం.. విద్యుత్ సౌకర్యం లేని రోజుల్లోనే జనరేటర్ ఆధారంగా విద్యుత్ దీపాల కాంతులతో ధగధగలాడిన భవనం స్థానికులకు చిరపరిచితం. కొత్తవారిని అబ్బుర పరిచే గంధర్వ మహల్. పలువురు ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారులకు ఆతిధ్యం ఇచ్చిన ఘనత గంధర్వ మహల్ సొంతం.

\- ఆచంట



గంధర్వ మహల్



సింహద్వారం



మహల్‌లో ఉన్న పియానో

వందేళ్ల గంధర్వ మహల్

ఆచంటలో అబ్బురపరిచే
చారిత్రక కట్టడం

రాజుల పాలనలో కోటలు అద్భుత కట్టడాలు. రాచరికం అంతరించి జమిందారీ వ్యవస్థ వచ్చింది. రాజుల తరహాలో జమిందారులు కూడా అద్భుత భవనాలు నిర్మించి తమ వైభవం చాటే ప్రయత్నం చేశారు. జిల్లాలో పూర్వపు రోజుల్లో రెండే రెండు కుటుంబాలు ఆదాయ పన్ను చెల్లించేవారని చెబుతారు. ఒకటి ఏలూరుకు చెందిన మోతి జమిందార్ కుటుంబం.. రెండోది ఆచంటకు చెందిన గొడవర్తి వారి కుటుంబం.. 1916లో గొడవర్తి కుటుంబంలో యువకుడు గొడవర్తి నాగేశ్వరరావు ఓ అద్భుత భవనాన్ని నిర్మించాలని భావించాడు. ఆయన రాజస్థాన్ వెళ్లి అక్కడి కోటలు, కట్టడాలను పరిశీలించారు. అనంతరం ఆచంటలో 1918లో గంధర్వ మహల్ నిర్మాణం మొదలు పెట్టారు. 1924లో నిర్మాణం పూర్తయింది. విద్యుత్ సౌకర్యం పూర్తిస్థాయిలో లేని రోజుల్లో విదేశాల నుంచి విద్యుత్ దీపాలు రప్పించి జనరేటర్ ద్వారా భవనం అంతా రంగు రంగుల దీపాలతో జిగేలమనిపించేవారని పూర్వీకులు చెబుతారు. గంధర్వ మహల్ పేరుకు తగ్గట్టుగానే గంధర్వులే నిర్మించారా అన్నట్టుగా అద్భుత కళా నైపుణ్యంతో చూపరులను ఆకట్టుకుంటుంది. వందేళ్ల క్రితం సర్వాంగ సుందరంగా నిర్మితమైన గంధర్వ మహల్ నేటికి చెక్కు చెదరలేదు. అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, ఎన్‌టీ.రామారావు, చంద్రబాబు నాయుడు పలువురు మంత్రులు ఈ భవనంలో ఆతిధ్యం స్వీకరించారు. ఈ భవనాన్ని చూసిన వారు మైసూర్ మహరాజ్ ప్యాలెస్ గోల్కొండ కోట చూసిన అనుభూతి పొందుతారు. అడుగడుగునా రాచఠీవితో నాటి జమిందారి వ్యవస్థ వైభవానికి ప్రతీకగా గంధర్వ మహల్ నిలిచింది. మహల్ నిర్మాణం కోసం బర్మా నుంచి టేకు, కలప, బెల్జియం అద్దాలు, లండన్ నుంచి ఇనుప గడ్డర్లు దిగుమతి చేసుకున్నారు. సున్నపు రాయి, కోడిసొనతో చేసిన సిమెంట్‌తో భవనం నిర్మించినట్లు భవనంలో నివసిస్తున్న కుటుంబంలో ఒకరైన గొడవర్తి శ్రీరాములు వివరించారు.



అబ్బురపరిచే సెంట్రల్ హాల్

నేడు గంధర్వ మహల్ వందేళ్ల పండగ

గంధర్వ మహల్ నిర్మించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా జమిందార్ గొడవర్తి నాగేశ్వరరావు వారసులు ఈ నెల 19న వేడుకలు నిర్వహించనున్నారు. నాగేశ్వరరావు అనంతరం మూడో తరాల వారసులు గంధర్వ మహల్‌లో నివసిస్తున్నారు. నాలుగో తరం వారం కొందరు విదేశాలలో స్థిరపడ్డారు. మూడు, నాలుగు తరాల వారంతా ప్రస్తుత వేడుకలకు హాజరవుతున్నారు.

1885 నాటి పియానో

గంధర్వ మహల్ సెంట్రల్ హాలులో దర్శనమిచ్చే పియానో అదనపు ఆకర్షణగా నిలుస్తుంది. గొడవర్తి కుటుంబంలో సంగీత ప్రియులు లండన్ నుంచి పియానో తెప్పించారు. 1885లో లండన్‌లో నిర్వహించిన ప్రదర్శన పోటీలలో పురాతన పియానోగా రజత పతకం పొందడం విశేషం. పియానో మీటడంలో పూర్తిస్థాయి ప్రావీణ్యం లేకున్నా ఇప్పటికీ తాను కొన్ని స్వరాలు పలికిస్తానని ఇప్పటి తరం శ్రీరాములు చెబుతారు.

చెక్కు చెదరని కట్టడం

జమిందార్ గొడవర్తి నాగేశ్వరరావు 1924లో గంధర్వ మహల్‌ను నిర్మించారు. ఈ మహల్ నిర్మించి 2020 నాటికి వంద వసంతాలు పూర్తి చేసుకున్నా చెక్కు చెదరలేదు. 1918లో చేపట్టిన భవన నిర్మాణానికి అప్పట్లో సుమారు రూ.10 లక్షలు వెచ్చించినట్లు అంచనా. నిర్మాణ పనులకు ఆరేళ్ల కాలం కాగా 1924లో పూర్తయింది. అర ఎకరం విస్తీర్ణంలో నిర్మితమైన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి నాలుగు అంతస్తులు. 12 పడక గదులతో కలిపి మొత్తం 25 గదులు. 1969, 2008 రంగులు వేశారు. తాజాగా వందేళ్ల పండుగకు ఇటీవల మళ్లీ రంగులు వేయించారు. ప్రస్తుతం భవనం మొత్తం రంగులు వేయడానికి రూ.25 లక్షలు వెచ్చించారు.

చారిత్రక వారసత్వం



మా కుటుంబీకులు గంధర్వ మహల్ చారిత్రక వారసత్వం. మహల్ నిర్మించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 19న మా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నాం. భవనం నిర్మాణమైన తర్వాత మూడు సార్లు రంగులు వేయించాం. ఈ వేడుకలకు మా కుటుంబ సభ్యులతోపాటు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

\- గొడవర్తి శ్రీరాములు, మాజీ సర్పంచ్ గంధర్వ మహల్ కుటుంబ సభ్యుడు





తుండ్లు కప్పుకుని దర్శనానికి వెళ్తున్న భక్తులు

దర్శనానంతరం బయటకు వస్తున్న భక్తులు

జోరు వర్షంలోనూ
వెంకన్న దర్శనం..

ద్వారకాతిరుమల, జూలై 18: జోరున వర్షం కురుస్తున్నా.. రహదారులన్నీ జలమయమైనా శ్రీవారి భక్తులకు అవేవీ ఆటంకం కాలేదు. భక్తిపారవశ్యం ముందు అవన్నీ చిన్నపాటి సమస్యలే అని నిరూపించారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా సరే లెక్కచేయకుండా ఆలయానికి అధిక సంఖ్యలోనే భక్తులు విచ్చేశారు. వీరంతా గొడుగులు, తుండ్లు తలపై ఉంచుకుని క్షేత్రపరిసరాల్లో సంచరించారు. కొందరైతే స్వామివారి దర్శనానికి తడుస్తూనే వెళ్లివచ్చారు.



ఎర్రకాల్వ, జల్లేరు జలాశయాల నుంచి నీటి విడుదల దృశ్యాలు.. తమ్మిలేరు కాజ్‌వే వద్ద వరద ప్రవాహం

జలాశయాల నుంచి నీరు విడుదల

ఏలూరుసిటీ/జంగారెడ్డిగూడెం/బుట్టాయగూడెం/చాట్రాయి/చింతలపూడి : జంగారెడ్డిగూడెం మండలంలోని శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాల్వ జలాశయంలోకి గురువారం వరదనీరు పోటెత్తింది. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 82.40 మీటర్లు వరకు నీరు చేరిందని ఇరిగేషన్ ఏఈ సీహెచ్.భాస్కరరావు తెలిపారు. గంటకు 72,111 క్యూసెక్కుల వరదనీరు జలాశయంలోకి వచ్చి చేరుతుండగా జలాశయం గేట్లు తెరచి 10,239 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు వదిలినట్టు తెలిపారు. ఎర్రకాలువ దిగువ ఉన్న జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, నల్లజర్ల, తాడేపల్లిగూడెం, నిడదవోలు మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జలవనరుల శాఖాధికారులు సూచించారు.

జల్లేరు జలాశయం నుంచి 1,500 క్యూసెక్కులు..

బుట్టాయగూడెం మండలంలోని గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయంలోకి వరద ఉధృతి పెరగడంతో గేట్లు ఎత్తి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ డీఈ ఆనంద్, ఏఈలు సురేష్, తులసీ తెలిపారు. ప్రస్తుతం జలాశయంలోకి 3 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోందని, జలాశయం పూర్తి నీటిమట్టం 217.80 ఎంటీఎస్ కాగా ప్రస్తుతం 215 ఎంటీఎస్‌లకు చేరడంతో ముందు జాగ్రత్త చర్యగా 1,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

తమ్మిలేరు రిజర్వాయర్‌కు వరద నీరు

చింతలపూడి సమీపంలోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 336.33 అడుగులు ఉంది. ఎగువ నుంచి 858 క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది. ఎగువ తెలంగాణలో వర్షాలు పడుతున్నందున శివపురం వద్ద వంతెనకు ఆనుకుని వాగులో వరద నీరు వస్తోంది. తమ్మిలేరు రిజర్వాయర్, గోనెలవాగు రెండుబేసిన్‌లు ఉన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వచ్చిన వరద నీరు తమ్మిలేరు రిజర్వాయర్‌లో చేరి అక్కడి నుంచి గోనెలవాగులోకి చేరుతుంది. రెండు బేసిన్‌లు నిండిన తరువాత 348 అడుగులు దాటితే వరద నీరు దిగువకు విడుదల చేస్తామని ప్రాజెక్టు ఏఈ పరమానందం తెలిపారు.

నేడు ఏజెన్సీలో స్కూళ్లకు సెలవు

బుట్టాయగూడెం : అల్పపీడనం కారణంగా ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున శుక్రవారం కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేయడంతో ఈనెల 19న ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించామని కేఆర్ పురం ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. గురువారం ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో పీవో పర్యటించి ముందు జాగ్రత్తలను వివరించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



డాక్టర్ సుమన్ నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘునందనరావు

ఏలూరు క్రైం, జూలై 18 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (అకడమిక్) డాక్టర్ రఘునందనరావు వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగాలను, వార్డులను, అత్యవసర విభాగాన్ని, ఐసీయూ విభాగాన్ని పరిశీలించారు. నేరుగా రోగులతో మాట్లాడారు. వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రులు ఉన్నప్పుడు అన్ని విధాల సేవలు అందేవని ప్రస్తుతం అరకొరగా వైద్య సేవలు అందుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. ఆసుపత్రిలో పడకలు తగ్గించారని, ప్రతి కేసు కూడా ఇక్కడ బెడ్స్ లేవంటూ విజయవాడ, గుంటూరు రిఫర్ చేస్తున్నారంటూ ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. అత్యవసర విభాగంలో డాక్టర్ సుమన్ నుంచి ఆసుపత్రికి వచ్చే కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అన్ని చర్యలు చేపట్టామని ఇప్పటికే ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి మరో వంద పడకలు అదనంగా మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు మెరుగైన వైద్య సేవలు అందించారని అయితే ఇప్పుడు ఆ విధంగా వైద్య సేవలు అందించలేకపోతున్నారనే దానిపై విచారణ చేపట్టామన్నారు. ఆసుపత్రి పరిస్థితులను ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాసరావు, ఆర్ఎంవో డాక్టర్ ప్రసాదరెడ్డి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఎఎస్ రామ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లికార్జునరావు పలువురు పాల్గొన్నారు.

గంగానమ్మ గుడిని
ఢీకొట్టిన లారీ

ఏలూరు క్రైం, జూలై 18 : అతివేగంగా వెళుతున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గంగానమ్మ గుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గుడి ప్రహరీ కూలి గోడలు కొంతభాగం దెబ్బతిన్నాయి. లారీ డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. ఏలూరు నుంచి మాదేపల్లి రోడ్‌లో గురువారం ఉదయం వెళుతున్న చేపల మేత కంటైనర్ లారీ అదుపుతప్పి మాదేపల్లిలోని గంగానమ్మ గుడిని ఢీకొంది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. లారీ డ్రైవర్, లారీ యజమాని కలిసి గుడి నిర్వాహకులతో చర్చలు నిర్వహించుకుని సమస్య పరిష్కరించినట్టు తెలుస్తోంది.



గంగానమ్మ గుడిని ఢీ కొన్న లారీ

క్రైం కార్నర్

లారీని ఢీకొట్టి ఓఎన్‌జీసీ ఉద్యోగి దుర్మరణం

యలమంచిలి, జులై 18:దేవరపల్లి గ్రామానికి చెందిన కాళ్ల సత్యనారాయణ(49) కాజ గ్రామపరిధిలోని జాతీయరహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందినట్టు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. చింతలమోరి ఓఎన్‌జీసీలో ఉద్యోగం చేస్తూ నరసాపురంలో సత్యనారాయణ నివాసం ఉంటున్నాడు. యథావిధిగా బుధవారం విధులు ముగించుకుని బైక్‌పై నరసాపురం తిరిగి వస్తున్న అతడిని కాజ జాతీయరహదారిపై అతడి ముందు వెళుతున్న లారీ సడన్‌గా ఆగడంతో.. లారీని ఢీకొట్టిడు. అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యాన్ ఢీకొని ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, జూలై 18:ఆసుపత్రిలో ప్రసవించిన మహిళను చూసేందుకు బైక్‌పై వెళ్తుండగా వ్యాన్ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. దెందులూరు మండలం కొమిరేపల్లికి చెందిన బండి మనోహర్(35) వదిన మానేపల్లి జ్యోతి పెద్దకుమార్తె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రసవించింది. ఆమె వద్దకు ఈనెల 17న మనోహర్, అతడి భార్య వేళంగి, జ్యోతి చిన్నకుమార్తె లావణ్య ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. రాత్రి పొద్దుపోవడంతో తంగెళ్ళమూడిలో ఉన్న మనోహర్ సోదరుడి ఇంటికి వెళ్ళారు. గురువారం ఉదయం వారు ముగ్గురూ బైక్‌పై ఆసుపత్రికి వస్తుండగా ఒక వ్యాను అతి వేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్ర గాయాలకు గురికాగా, మనోహర్‌ను ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, జూలై 18 : మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరిని బస్సు ఢీ కొనడంతో వారిద్దరికి కాళ్లు విరిగిపోయాయి. ఏలూరు తూర్పువీధికి చెందిన బాలాజీ, పి.వెంకటసీతామహాలక్ష్మి మోటారు సైకిల్‌పై ఏలూరు ఫైర్‌స్టేషన్ నుంచి పాతబస్టాండ్‌వైపు వెళ్తుండగా ఓవర్ బ్రిడ్జిపై ఆర్టీసీ బస్సు గురువారం మధ్యాహ్నం ఢీ కొంది. ఈ ప్రమాదంలో బాలాజీ కుడికాలు పూర్తిగా విరిగిపోగా, సీతామహాలక్ష్మి కుడికాలు తొడ భాగంలో విరిగిపోయింది. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా కేసు నమోదు చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వ్యాన్ ఢీకొని మోటార్ సైక్లిస్ట్‌కి తీవ్ర గాయాలు

కరప, జూలై 18: కరప మండలం పెదకొత్తూరు చెరువువద్ద గురువారం వ్యాన్ ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. కరప పోలీసులు తెలిపిన వివరాలివి.. పెనుగొండ మండలం ఇలపర్రు గ్రామానికి చెందిన కట్టా పృధ్వీనాగ్ కాకినాడలోని ఒక వాషింగ్ మెషీన్ల సర్వీసింగ్ పాయింట్‌లో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం రామచంద్రపురంలో వాషింగ్ మెషీన్ కంప్లైంట్ నిమిత్తం అతడు బైక్‌పై తిరిగి కాకినాడ ప్రయాణమయ్యాడు. పెదకొత్తూరు చెరువు టర్నింగ్ వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు పనసకాయల లోడుతో వెళ్తున్న వ్యాన్ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు గూడూరి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తూపాటి రామకృష్ణ తెలిపారు.

భీమవరంలో బియ్యం వ్యాపారి అదృశ్యం

▸▸ బాకీల వసూళ్లకు వెళ్లి ఇంటికి తిరిగిరాని వైనం

భీమవరం క్రైం, జూలై 18 : అతనొక హోల్‌సేల్ బియ్యం వ్యాపారి.. పలు దుకాణాలకు బియ్యం అమ్మకాలు కొనసాగించడమే కాకుండా వారికి ఇచ్చిన బియ్యం తాలూకా సొమ్ములు వసూళ్లకు పక్క గ్రామాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాని ఘటన జరిగింది. భీమవరం వన్‌టౌన్ ఏఎస్ఐ దేవరాజ్ తెలిపిన వివరాలివి.. స్థానిక 18వ వార్డు గులాబీ సెంటర్‌లో నివాసం ఉండే గొంట్ల వెంకటనారాయణ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట హోల్‌సేల్ బియ్యం దుకాణం నడుపుతుంటారు. ఎప్పటిమాదిరిగా బియ్యం తాలూకా బకాయిల కోసం భీమవరం మండలంలోని పలు గ్రామాలకు ఈనెల 17వ తేదీన వెళ్ళారు. రాత్రి పది గంటలైన ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, భార్య అన్నిచోట్ల వెతికారు. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు. 18వ తేదీ తెల్లవారుజాము నుంచి సెల్‌ఫోన్ పని చేయకపోవడంతో వ్యాపారి భార్య లక్ష్మీనారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.


కొయ్యలగూడెం - కన్నాపురం రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు


కుక్కునూరు - అశ్వారావుపేట రహదారిపై ప్రవహిస్తున్న నీరు


చెరువును తలపిస్తున్న జంగారెడ్డిగూడెం - ఏలూరు రోడ్డు


జలమయమైన ఏలూరు యాదవ నగర్


రావికంపాడు - ద్వారకాతిరుమల రహదారిపై కూలిన చెట్టు

ముంచేసింది


జీలుగుమిల్లి సమీపంలో పొంగి ప్రవహిస్తున్న అశ్వారావుపేట వాగు

• ఎడతెరిపిలేని వర్షం • పల్లపు ప్రాంతాలు జలమయం • కాల్వలను తలపించిన రహదారులు


కొయ్యలగూడెం మండలంలో చేలల్లో చేరిన నీరు


చింతలపూడి మండలంలో నీట మునిగిన నారుమడులు


పెదపాడు మండలంలో మునిగిన నాట్లు

ఏలూరు టూటౌన్, జూలై 18: అల్పపీడన ప్రభావంతో గురువారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. రోడ్లపై గుంతల్లో నీరు చేరి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కాలనీలన్ని నీటితో నిండిపోయాయి. ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగులు, వ్యాపారులు, సామా న్యులు నానా అవస్థలు పడ్డారు. నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. తంగెళ్ళమూడి, సత్రంపాడు, మాదేపల్లి, వెంకటాపురం గ్రామాల్లో పరిస్థితి అత్యంత దయనీయం. అశోక్ నగర్, పత్తేబాద, ఆర్ఆర్.పేట, ఎన్ఆర్.పేట వన్‌టౌన్‌లో చాలాచోట్ల నీరు నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి ఉంది. నడిచి వెళ్ళే వారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

● కొయ్యలగూడెం: భారీ వర్షాలతో రోడ్లు జలమయం అయ్యాయి. ఉదయం నుంచి బారీ వర్షం కురియడంతో పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. కొయ్యలగూడెం నుంచి కన్నాపురం వెళ్లే రహదారి మునిగిపోయింది. కన్నాపురం పడమటి కాల్వ, తూర్పు కాల్వ ఉధృతంగా ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రాజవరం వద్ద ఎర్రకాల్వ నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండడంతో అధికారులు అప్రమత్తం అయ్యా రు. ఎర్రకాల్వ డ్యామ్ గేట్లు ఎత్తివేయడంతో వరదనీరు ఉధృత మైందని అధికారులు తెలిపారు. పొంగుటూరులో ఒక ఇంటి గోడ పడిపోయింది. దిప్పకాయలపాడు, కొయ్యలగూడెంలోని తారకరామరావు నగర్ ప్రాంతంలో వర్షపునీరు పల్లపు ప్రాంతాల్లో చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీలో కొండ కాల్వలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొయ్యలగూడెం మండ లంలోని కాల్వల ద్వారా చెరువులకు రావడంతో చెరువులన్ని పూర్తిగా నిండాయి. గురువారం రాత్రి కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు.

● కుక్కునూరు: ఏజెన్సీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో కుండపోతగా వర్షం కురిసింది. గురువారం ఉదయం 8గంటల నుంచి కుక్కునూరు మండలంలో 155.2 మి.మీ., వేలేరుపాడులో 240 మి.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. కుక్కునూరు అశ్వారావుపేట, కుక్కునూరు భద్రాచలం ఆర్ అండ్ బీ ప్రధాన రహదారిపై వర్షపు నీరు ప్రవహించింది. దీంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. చెరువుల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో నీటితో నిండిపోయాయి.

రెవెన్యూ సిబ్బంది అప్రమత్తం

గోదావరి ఉధృతి పెరుగుతున్న క్రమంలో వరద పరిస్థితిని ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉన్నామని తహసీల్దార్ అచ్యుతకుమారి తెలిపారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మెరక ప్రాంతాల్లో దాదాపు 900 టన్నుల బియ్యం నిల్వ చేశారు. వరదవస్తే బాధితులను తరలించడానికి ట్రాక్టర్లు, నాటుపడవలు, బోట్లు, లాంచీలు అందుబాటులో ఉంచారు. బాధితుల కోసం పునరావాస కేంద్రాల్లో ముందస్తుగా కొవ్వొత్తులు, పాలు, బిస్కెట్లు నిల్వ చేశారు.

● ఉంగుటూరు: మండలంలో ఏకధాటి వర్షంతో పల్లపు ప్రాంతాలు నీట ముని గాయి. డ్రెయినేజీలు నిండి రహదారులపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. జనజీవనం స్తంభించిపోయింది.

● జంగారెడ్డిగూడెం: ఎడతెరిపి లేని వర్షంతో పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీలు పొంగిపొర్లి రహదారులన్నీ కాలువలను తలపించాయి. అశ్వారా వుపేట రోడ్డు కాకర్ల జంక్షన్ వద్ద ప్రధాన డ్రెయినేజీ నుంచి వర్షపు నీరు పొంగి రోడ్డుపై కాలువ కట్టింది. పోలీస్ స్టేషన్ ఎదురుగా రహదారి నీట మునిగిం ది. బుట్టాయగూడెం రోడ్డులోని గాంధీ బొమ్మ సెం టర్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డులో వరద నీరు ఏరులా ప్రవహించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏలూరు రోడ్డులో డ్రెయినేజీ దిగువ భాగం పెద్ద చెరువును తలపించింది. ఊర చెరువు నుంచి లక్ష్మీ థియేటర్ వరకు సీసీ డ్రెయిన్‌కు కల్వర్టు ఎత్తుగా నిర్మించడంతో డ్రెయినేజి నుంచి వర్షపు నీరు పక్కనే ఉన్న ఇళ్లలోకి చేరింది. వంట చేసుకునే పరిస్థితి కూడా లేదని స్థానికురాలు బత్తుల రమణ ఆవేదన వ్యక్తం చేశారు. బకెట్లతో నీరు బయటకు తోడుతున్నామని వీరంకి వెంకటలక్ష్మి తెలిపారు. మార్కెట్ యార్డు గేటు వద్ద గోతిలో నీరు నిలిచిపోయింది. కుండపోత వర్షంతో వారపు సంత వెలవెలబోయింది. సీతామహాలక్ష్మి వృద్ధుల ఆశ్రమంలో వరదనీరు చేరుకోవడంతో మున్సిపల్ కమిషనర్ జె.నరేంద్రకుమార్ ఆశ్రమాన్ని సందర్శించారు. వృద్ధులను మున్సిపల్ చైర్‌పర్సన్ సహకారంతో స్థానిక కల్యాణమండపానికి తరలించారు.

● పెదపాడు: మండలంలో భారీ వర్షంతో పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షానికి తోడు పైనుంచి కాలువలు పొంగి ప్రవహించడంతో వరి చేలు మునుగుతున్నాయి. కొన్నిచోట్ల నారుమడుల్లో నీరు చేరడంతో రైతులు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.

● పెదవేగి: వీడని వర్షంతో జనజీవనం స్తంభించింది. రహదారులు జలమయమై, వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. లక్ష్మీపురం దగ్గర గోపన్నపాలెం - బాదరాల ఆర్అండ్‌బి రహదారిపై రెండు చోట్ల భారీగా గోతులు పడ్డాయి. వర్షపు నీటితో గోతులు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు నానా పాట్లు పడుతున్నారు. మండలంలో 20మిల్లీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది.

● నిడమర్రు: వర్షాలకు జనజీవనం మొత్తం స్తంభించిపోయింది. కుండ పోత వానతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. భువనపల్లి, ఎనికేపల్లి, అడవికొలను, ఛానమిల్లి, సిద్దాపురం, బావాయిపాలెం, క్రొవ్విడి ఆయకట్టు ప్రాంతాలలో సుమారు 50 ఎకరాల్లో నారమడులు నీట మునిగాయి. రెండు రోజుల క్రితం నాట్లు వేసిన చేలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతు న్నారు.

● కామవరపుకోట: మండలంలో భారీ వర్షానికి రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని తడికలపూడి, ఆడమిల్లి గ్రామాల సెంటర్లలో రోడ్లు గోతులమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రావికంపాడు - ద్వారకాతిరుమల రహదారిలో చెట్టు నేలకొరిగింది. అధికారులు రోడ్డుపై చెట్టును తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

● ద్వారకాతిరుమల: ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరింది. లోతట్టు ప్రాంతాలు సైతం వర్షపు నీటితో నిండిపోయాయి. దొరసానిపాడులో వీధుల్లో వర్షపునీరు పోయే దారిలేకపోవడంతో రోడ్లు నీట మునిగాయి. ద్వారకాతిరుమలోని ప్రధాన రహదారి, తిమ్మాపురం రోడ్డు సైతం వర్షపునీరు చేరి చెరువులను తలపించాయి.

● చింతలపూడి: భారీ వర్షంతో వాగులు పొంగి, చెరువులు అలుగులు పడి ప్రవహిస్తున్నాయి. కొత్త బస్టాండు సెంటర్‌లో వరదనీరు రోడ్డుపైకి రావడంతో మట్టిని తొలగించి నీరు వెళ్లేవిధంగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. పంట పొలాలు నిండా నీరు నిలిచి ఉన్నాయి. చేలలో నీరు పోయేవిధంగా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ బి.నాగ కుమార్, ఏవో మీనాకుమారి, రైతులకు సూచించారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న కేఆర్ పురం తూర్పు కాలువ


పెదవేగి మండలంలో రహదారిపై గోతుల్లో నీరు


ఏలూరు యునాని నగర్‌లో గోతులు పడిన రహదారి


నీటమునిగిన రోడ్డుపై పాఠశాల విద్యార్థులు


ఉంగుటూరు మండలం కైకరం వద్ద వర్షం జోరు

వైసీపీ పాలనలో సమస్యల నిలయంగా గ్రామాలు


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరు రూరల్, జూలై 18: కమిషన్ల కోసం కక్కుర్తిపడి జగన్ రెడ్డి ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంతో గ్రామాలు సమస్యలకు నిలయంగా ఉన్నాయని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మీకోసం మీ చింతమనేని కార్యక్రమంలో భాగంగా గురువారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు, జాలిపూడి, కాట్లంపూడి, లింగారావుగూడెం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, పలుశాఖల అధికారులతో ప్రభాకర్ సమీక్షించారు. సమస్యలను స్వయంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

అగ్నివీర్ వాయుసేనపై అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న వాయుసేన అధికారి

ఏలూరు రూరల్, జూలై 18: ఎయిర్‌ఫోర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు అగ్నివీర్ వాయుసేనపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. నాన్ కమాండింగ్ ఆఫీసర్ ఎస్.సందీప్ విద్యార్థులకు త్రివిధ దళాల సేవలు వివరించారు. ఉద్యోగం పొందడానికి మెళుకువలను వివరించారు. జిల్లా ఉపాధి అధికారి మధుభూషణ్‌రావు, ఎన్‌సీఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ్ కృష్ణ, సెట్‌వెల్ సూపరింటెండెంట్ కెనడీ, జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ ఐబీ విశ్వనాథ్, గిరిబాబు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ తరపున రెడ్‌క్రాస్‌కు సహకరించండి

ఏలూరు క్రైం, జూలై 18: డీజీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీహెచ్ ద్వారకా తిరుమలరావును రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందించి రెడ్‌క్రాస్ జ్ఞాపికను అందజేశారు. కృష్ణారెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన కాలంలో ద్వారకాతిరుమలరావుతో పలు లీగల్ సెమినార్లు, పోలీస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరాలకు పోలీస్ శాఖ తరపున సహకరించాలని డీజీపీని కోరినట్లు ఆయన తెలిపారు.

మహిళలు, బాలికల సంరక్షణే లక్ష్యం

కామవరపుకోట, జూలై 18: మిషన్ శక్తి ద్వారా మహిళలు, బాలికల సంరక్షణే ధ్యేయమని జంగారెడ్డిగూడెం సీడీపీవో పి.బ్యూలా తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు మిషన్ శక్తిపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల రక్షణ చట్టాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. పోక్సో, ఉమెన్ హెల్ప్‌లైన్, 181, చైల్డ్ వెల్ఫేర్ హెల్ప్‌లైన్, 1098పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బీవీఎల్.మంగాదేవి, ఎన్.వీరకుమారి, జీఎంఎస్ఆర్‌కె ఎ.రాధ, కిశోర బాలికలు, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్

ఏలూరుసిటీ, జూలై 18: హర్‌ఘర్ జల్ పథకం కింద జిల్లాలో కుళాయిలేని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం హర్‌ఘర్ జల్, సంపూర్ణ పారిశుధ్య పథకం, తాగునీటి సరఫరాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

అధికారులను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే రోషన్


హాస్టల్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోషన్

చింతలపూడి, జూలై 18: వర్షాలు, వాతావరణ హెచ్చరికలతో నియోజకవర్గంలో అధికారులను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అప్రమత్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాల వల్ల జ్వరాలు పెరిగే అవకాశం ఉన్నందున వైద్యశాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, ఏరియాఆసుపత్రిలో వైద్యసేవలు అందించాలని సూచించారు.

పట్టణంలోని బోయగూడెం హాస్టల్లోకి డ్రైనేజి నీరు రావడంతో విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయన హాస్టల్ పరిశీలించి డ్రైనేజి వాటర్ పోయేవిధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లో ఎమ్మెల్యే సొంత ఖర్చుతో ఇన్వర్టర్ ఏర్పాటు చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ రాజశేఖరరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● లింగపాలెం: వర్షాల జోరు, ముంపుతో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజిగూడెంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అత్యవసరమైతే ఏ సమయంలోనైనా తనను సంప్రదించాలని తాను ప్రజలందరికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి : డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం, జూలై 18: జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో గురువారం భారీ వర్షంతో వాగులు, కాలువలు పొంగుతున్నాయని, ప్రజలు అధికంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ యు.రవిచంద్ర సూచించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాలువలు దాటవద్దని, పశువులను కాలువల వద్ద మేపవద్దని, ఈత కొట్టవద్దని, సూచించారు. పాతబడిన గోడలు, మిద్దెలు, కరెంటు స్తంభాల వద్దకు వెళ్లవద్దని సూచించారు.

కాలువలో పడిన విద్యార్థిని : కాపాడిన కానిస్టేబుల్



ఏలూరు క్రైం, జూలై 18 : స్కూలు నుంచి ఇంటికి సైకిల్‌పై వెళుతున్న విద్యార్థిని ట్రాఫిక్ సమస్యతో శనివారపుపేట లోబ్రిడ్జి వద్ద కాలువలో పడిపోయింది. అదే సమయంలో అక్కడ మోటారు సైకిల్‌పై ఉన్న ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ బాలికను కాపాడి బాలిక తల్లిదండ్రులకు ఆ కానిస్టేబుల్ ఫోన్ చేసి అప్పగించారు. కలెక్టర్ వెట్రిసెల్వి తమ్మిలేరు పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. శనివారపుపేట లోబ్రిడ్జిని కలెక్టర్, ఇతర అధికారులు పరిశీలించారు. తమ్మిలేరు రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులు తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ రాకతో వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపి వేయడంతో స్కూళ్లు, కాలేజీల నుంచి వెళుతున్న విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. కాల్వలో పడిన బాలికను కానిస్టేబుల్ రక్షించడంతో బయటపడింది.

22 నుంచి పాఠశాలల్లో శిక్షా సప్తాహ్

ఏలూరు రూరల్, జూలై 18: పాఠశాలల్లో ఈనెల 22 నుంచి 28 వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంఈవో, హెచ్ఎంలను డీఈవో ఎస్.అబ్రహం ఆదేశించారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 22న ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన, అభ్యసన సామగ్రి తయారుచేసి ప్రదర్శించాలన్నారు. 23న పునాది అభ్యసన సంఖ్యాశాస్త్రం, నైపుణ్యాల అభివృద్ధి, 24న క్రీడాదినోత్సవం, విద్యార్థులకు క్రీడలు, శారీరక సౌష్టం ప్రాముఖ్యతను తెలియచేసేలా పోటీలు నిర్వహించాలన్నారు. 25న సాంస్కృతిక దినోత్సవం, 26న స్కిల్, డిజిటల్ ఇనిషియేటివ్‌డే నిర్వహించాలని, తరగతి గది అనుభవాలను మెరుగుపరచడానికి నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించాలన్నారు. 27న న్యూట్రీషన్‌డే నిర్వహించి, అమ్మపేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటి అమ్మకు అంకితం కార్యక్రమంలో తల్లీ బిడ్డలతో 35 మొక్కలు నాటించాలన్నారు. 28న తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థినీ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయాలన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి


ర్యాలీ చేస్తున్న న్యాయమూర్తులు

ఏలూరు క్రైం, జూలై 18: ద్విచక్ర వాహన దారులు, వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో తలకు గాయం కాకుండా జాగ్రత్త పడవచ్చని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఐ.శ్రీనివాసమూర్తి అన్నారు. హెల్మెట్ ధారణ - ప్రమాదాల నివారణ అంశంపై గురువారం ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు. న్యాయాధికారి కేకేవీ.బుల్లికృష్ణ మాట్లాడుతూ ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలనాన్నరు. ఏలూరు బార్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్, డీఎస్పీ ఈ శ్రీనివాసులు మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ వలంటీర్లు, ఎస్వీఆర్‌కె డిగ్రీ కాలేజీ విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

● జంగారెడిగూడెం: ద్విచక్ర వాహనం నడిపే ప్రతీ ఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించాలని న్యాయాధికారి కిషోర్‌కుమార్ అన్నారు. హెల్మెట్ ధారణపై న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లాయర్లు, సీఐ పి.రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు వేర్వేరుగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిషోర్‌కుమార్ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనం నడిపి ప్రమాదాలలో పలువురు ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ వాహనదారు హెల్మెట్ ధరించాలని సీఐ పి.రాజేష్ సూచించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై జ్యోతిబసు, మండల న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులైన లాయర్లు పాల్గొన్నారు.

● చింతలపూడి: జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. హెల్మెట్ ధరించటం వల్ల రోడ్డుప్రమాదాల నుండి ప్రాణాలు కాపాడుకోవచ్చని బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు అన్నారు. సదస్సులో ఎండీ అక్బర్‌ఆలీ, వి.సత్యనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రధాని ఇచ్చిన హామీల అమలుపై ఎంపీకి వినతి

ఏలూరు కార్పొరేషన్, జూలై 18: ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోదీ ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు డేగా ప్రభాకర్, కె.శ్రీనివాస్, బండి వెంకటేశ్వరరావు, పి.రామకృష్ణ, పీబీవీ.సుబ్రహ్మణ్యం, కెఎస్ఎన్.మూర్తి, ఎం.కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వాట్సప్ ద్వారా ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌కు పంపినట్టు చెప్పారు. ఆర్ఆర్‌పేట స్ఫూర్తి భవన్‌లో జరిగిన సంయుక్త కిసాన్ మోర్చ సమావేశంలో నాయకులు సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. డిమాండ్ల సాధనకై మరో పోరాటం చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. రైతు ఉద్యమకారులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, అమరవీరుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు.

గిరిజనులకు రక్షణ కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

టి.నరసాపురం, జూలై 18: భూస్వాముల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ కృష్ణాపురం మెట్ట గిరిజనులు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసి గిరిజనులను గిరిజనేతర రైతు బెదిరిస్తున్నారని వివరించారు. తమకు రక్షణ కల్పించి సాగు చేస్తున్న భూమిని పరిరక్షించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఎం నాయకులు తెల్లం దుర్గారావు, మడకం కుమారి, వగ్గాల లక్ష్మి, బరగడ కుమారి తదితరులు ఉన్నారు.

రాట్నాలమ్మకు ఆషాఢ సారె

పెదవేగి, జూలై 18: ఆషాఢంలో అమ్మవారికి సారెను సమర్పిస్తే గ్రామమంతా సుభిక్షంగా ఉంటుందని ముసునూరు మండలం వేల్పుచర్ల గ్రామస్తుల నమ్మకం. రాట్నాలకుంట రాట్నాలమ్మకు గురువారం ఆషాఢ సారె సమర్పించారు. గ్రామానికి చెందిన పలువురు మహిళలు చీరలు, చలివిడి, అరిసెలు, మిఠాయిలు, పూలు, పండ్లతో కూడిన సారెను అమ్మవారికి అందించి, పూజలు చేశారు.


ఎస్వీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చంటి

విలక్షణ నటుడు ఎస్వీ రంగారావు

ఏలూరు టూటౌన్, జూలై 18: విలక్షణ నటనతో తెలుగు చలనచిత్ర చరిత్రలో ఎస్వీ రంగారావు అంచలంచెలుగా ఎదిగి ఎందరికో ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎస్వీఆర్ 50వ వర్ధంతి పవర్‌పేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించిన దిట్ట ఎస్వీఆర్ కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్వీఆర్ మనవడు బాబాజీ, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, టీడీపీ నాయకులు చల్లా వెంకటసత్యవరప్రసాదరావు, ఎంఆర్‌డీ బలరామ్, పూజారి నిరంజన్, బెల్లంకొండ కిషోర్, ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు క్రైం :** ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్‌ను ఎక్సైజ్ ఎస్పీ కుమారేశ్వరన్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందించి అభినందనలు తెలిపారు.
- ఏలూరులోని సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దెందులూరు నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించి చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.
- **ఏలూరు రూరల్ :** సీఆర్‌రెడ్డి పబ్లిక్‌స్కూల్లో గ్రామాలయ, షాడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణకు సైన్స్ నోడల్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. డిప్యూటీఈవో రవిప్రకాష్, ఎంఈవో ఆర్.రంగయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.
- **పెదపాడు :** జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన పనులు, నగదు చెల్లింపులపై గ్రామాల వారీగా సోషల్ ఆడిట్‌ను శుక్రవారం నుంచి జరుగుతుందని ఎంపీడీవో తేజరతన్ తెలిపారు.
- **ఉంగుటూరు :** మండలంలోని కైకరంలో గ్రామ సభ నిర్వహించి పలువురు కౌలు కార్డులు అందించారు. సర్పంచ్ నలగాల గోపి, ఎంపీటీసీ చెన్ను సత్యవాణి, వ్యవసాయ సిబ్బంది లోవరాజు, గ్లోరి పాల్గొన్నారు.
- **లింగపాలెం :** వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. కె.గోకవరం, ధర్మాజిగూడెం, లింగపాలెంల పీహెచ్‌సీల పరిధిలో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు.
- **ద్వారకాతిరుమల :** రైతు, కౌలు రైతు, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎం.నాగులపల్లి సచివాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టి వ్యవసాయ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కట్టా భాస్కరరావు, బి.సత్యనారాయణ, టి.మురళి పాల్గొన్నారు.
- **చింతలపూడి :** పట్టణంలోని గణేశ్ కాలనీవద్ద తార్ రోడ్డుపక్కనే చెట్టుపై పిడుగు పడింది. చెట్టు కాలి విద్యుత్ తీగలపై పడడంతో సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ అధికారులు చెట్టుకొమ్మలు నరికి సరఫరాను పునరుద్ధరించారు.
- **టి.నరసాపురం :** భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మక్కినవారిగూడెం దుర్గగుడి వద్ద జలవాగు, గంగినీడుపాలెం, బండివారిగూడెం మధ్యలో ముగ్గురాళ్ళవాగు, పాకలగూడెం వద్ద నీటి ప్రవాహం వంతెనపై నుంచి ప్రవహిస్తోంది. మధ్యాహ్నపువారిగూడెం - అప్పలరాజుగూడెం మధ్య ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది.

కంచె తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నూజివీడు టౌన్, జూలై 18 : పోతిరెడ్డిపల్లిలో అంగన్‌వాడీ టీచర్ వసుంధర కుటుంబంపై వేధింపుల శీర్షికన 'ఆంధ్ర జ్యోతి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించారు. తహసీల్దార్ జె.విశ్వనాథశాస్త్రి, రూరల్ ఎస్సై మల్లికార్జున రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని అంగన్‌వాడీ టీచర్ ఇంటికి ఇరువైపులా వేసిన కంచెను తొలగించాలని భూ సమస్యను సర్వే ద్వారా తేల్చుకోవాలని, కంచె వేసి వారి హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. సచివాలయ సిబ్బందితో కలిసి కంచెను తొలగించారు.



స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్

స్త్రీ,శిశు సంక్షేమంపై అవగాహన ఉండాలి

ముదినేపల్లి, జూలై 18 : ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాలపై అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు అవగాహన ఉండాలని కైకలూరు సీడీపీవో వి.దీప్తి అన్నారు. సంక్షేమ కార్యక్రమాలపై వంద రోజుల ప్రత్యేక అవగాహన శిబిరాలను ముదినేపల్లిలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె పలు అంశాలపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. సూపర్‌వైజర్ ఝాన్సీ పాల్గొన్నారు. బొమ్మినంపాడు, సింగరాయపాలెం సెక్టార్లలో కూడా సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాలు జరిగాయి. సర్పంచ్ దారం సుధ, టీచర్ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న సీడీపీవో

రేవంత్‌రెడ్డిని కలసిన టీడీపీ, బీజేపీ నేతలు

ముదినేపల్లి, జూలై 18 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం ముదినేపల్లి తెలుగుదేశం, బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. తెలుగుదేశం పార్టీ ఏపీ డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, బీజేపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ పైడిపాటి శివశంకర్‌తోపాటు టీడీపీ నాయకులు వినయ్ వర్మ, జోగి రామకృష్ణ, గుండాబత్తిన రాజేష్ (పెయ్యేరు) సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలసి అభినందనలు తెలిపారు.



రేవంత్ రెడ్డిని కలసిన శ్రీనివాస్, శివశంకర్

కౌలు గుర్తింపు కార్డులు అందజేత

చాట్రాయి, జూలై 18: బూరగ్గూడెం సచివాలయంలో గురువారం వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో కౌలు రైతులు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. వీఆర్వో సునీత, ఎంపీఈవో కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు గడ్డం కేశవ రెడ్డి, గోవర్దన్ రెడ్డి, శేఖర్, మాధవ రెడ్డి, కేశవరావు, రామరాజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కౌలు గుర్తింపు కార్డులు అందజేస్తున్న అధికారులు

పార్వతీపురం, సిగుడిపాడులో వైద్య శిబిరాలు

చాట్రాయి, జూలై 18: సిగుడిపాడు, పార్వతిపురం గ్రామాల్లో గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారులు దుర్గాప్రసాద్, జ్యోతి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జ్యోతి

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నవరత్నకుమారి

కైకలూరు, జూలై 18 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు హోమోజయ యూనిటెడ్ యంగ్ స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని సర్పంచ్ డీఎం నవరత్నకుమారి అన్నారు. వెలంపేట ఎంపీయూపీ స్కూల్లో గురువారం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు తిరుమాల రిషి, సభ్యులు వంశీ, హుస్సేన్ భాషా, సత్యనారాయణ, హెచ్‌ఎం దానం ప్రసాద్, వార్డు సభ్యులు గాలిబ్ బాబు పాల్గొన్నారు.

తీర్మానంపై విచారణ

నూజివీడు టౌన్, జూలై 18: గ్రామ సచివాలయ నిర్మాణానికి పాల్స్ తీర్మానాలు రాసి వైసీపీ నాయకులు చెప్పిన తీరుగా వ్యవహించారంటూ సర్పంచ్ ఫిర్యాదుతో గురువారం విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే బత్తులవారి గూడెంలో సచివాలయం నిర్మాణానికి గ్రామ పెద్ద ముసునూరి సుబ్బయ్య తదితరుల పేరుతో భూమిని విరాళంగా ఇచ్చారు. అందులో సచివాలయ నిర్మాణానికి పంచాయతీ తీర్మానం చేయగా అంతకు ముందే ప్రత్యేకాధికారుల పాలనలో జగన్న కాలనీ లే అవుట్‌లో సచివాలయ నిర్మాణానికి తీర్మానం చేసినట్లుగా పంచాయతీ సెక్రటరీ సీహెచ్ చంద్రిక రికార్డులను చూపించారు. తీర్మానం రికార్డుల్లో చేతిరాత తేడాగా ఉన్న విషయాన్ని గుర్తించిన గ్రామ సర్పంచ్ ముసునూరి లక్ష్మి కాంతమ్మ అభ్యంతరం తెలుపుతూ అప్పటి అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహించిన తీరుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. నూజివీడు డీఎల్‌పీవో సుందరి గ్రామ సచివాలయంలో పాల్స్ తీర్మానానికి సంబంధించి విచారణ చేపట్టారు. డీపీవోకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. లక్ష్మీకాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డీఎల్‌పీవో సుందరి

విద్యార్థినులకు అభినందనలు

ఆగిరిపల్లి, జూలై 18: స్థానిక జిల్లా పరిషత్తు బాలికల జూనియర్ కళాశాలలో 2023 -24లో సీనియర్ ఇంటర్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి, ఈఏపీసెట్-24లో ఐదుగురు విద్యార్థినులు ఎన్ఆర్ఐ లక్కిరెడ్డి బాలిరెడ్డి కళాశాలలో ఫ్రీ సీట్లు సాధించారు. వీరిని హెచ్‌ఎం ఎస్.శారద, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కె.అంజయ్య, ఈదర సర్పంచ్ దొండపాటి అనిత, ఏసుపాదం అభినందించారు.

సరసమైన ధర.. నాణ్యమైన సరుకు

ఆగిరిపల్లి, జూలై 18: మార్కెట్లో బియ్యం, కంది పప్పు ధరలు ఆకాశాన్ని అంటుతున్న వేళ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆగిరిపల్లిలో చవక ధరల దుకాణాన్ని ప్రారంభించారు. కిలో కందిపప్పు రూ.160లకు, బియ్యం రూ.48, రూ.49లకే విక్రయిస్తున్నామని ఆంజనేయ జనరల్ స్టోర్స్ యజమాని జూలూరు చంద్రమౌళీశ్వరరావు తెలిపారు. ఈ షాపును గురువారం ఆగిరిపల్లి డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్, తెలుగుదేశం మండల నాయకులు మడుపల్లి గోపాల్, చవటపల్లి విక్టర్ ప్రారంభించారు.



నాణ్యమైన సరుకు దుకాణం



కలిదిండిలో వెదజల్లిన పొలాల్లో వర్షపు నీరు



మండవల్లిలో 165 జాతీయ రహదారిపై వర్షానికి పడిన గోతులు



కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జాతీయ రహదారిపైకి చేరిన వర్షపు నీరు



చీపురుగూడెంలో నీటమునిగిన ప్రధాన రహదారి

కుండపోత వర్షం

» స్తంభించిన జనజీవనం » ఛిద్రమైన రహదారులు » ముంపులో వరి పైరు

కలిదిండి, జులై 18 : బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో వాతావరణం మార్పులతో భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెదజల్లిన పొలాల్లో వర్షపు నీరుతో పాటు డ్రైన్లు పొంగడంతో ముంపు బారిన పడే ప్రమాదం ఉంది. మురుగు కాల్వలు పూడిపోవడంతో వరద నీరు ఎగదన్ని వరి పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిస్తే వెదజల్లిన పొలాలు నీటమునిగే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. వెదజల్లిన పొలాల్లో వర్షపు నీరు బయటకు పోయేలా రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ సూచించారు. భారీ వర్షాలకు చేపల, రొయ్యల చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించే ప్రమాదం ఉందని నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పుతున్నారు. చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడి రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. రైతులు నష్ట పోతున్నారు.

● మండవల్లి : మండవల్లిలో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. 165 జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రధాన రహదారులు, రైల్వేస్టేషన్ వద్ద వర్షపు నీరు నిలిపోయింది. గ్రామీణా ప్రాంత రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. గురువారం సాయంత్రానికి వర్షం తెరపి ఇవ్వడంతో ప్రజలు రోడ్లపైకి రావడంతో మార్కెట్లలో సందడి కనిపించింది. వర్షాల వల్ల చెరువులో ఆక్సిజన్ సమస్య ఏర్పడింది విద్యుత్‌కు అంతరాయం కలగడంతో జనరేటర్లకు ఆయిల్ కోసం క్యాన్లుతో ఆక్వా రైతులు రోడ్లపై కనిపించారు.

● కైకలూరు : మండలంలో కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయ్యమయ్యాయి. జనజీవనం స్తంభించింది. గురువారం ఒక్కరోజే 10.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కైకలూరు-కలిదిండి ఆర్‌అండ్‌బీ రహదారి వద్ద పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. గ్రామీణా ప్రాంతాల్లో రహదారులు చిత్తడిచిత్తడిగా మారాయి.

● ముసునూరు : మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ప్రధాన, అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామాల్లో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో రహదారులపైనే మురుగు, వర్షపు నీరు ప్రవహించి దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెరువుల్లోకి ఓ మోస్తారు నీరు మాత్రమే చేరింది.

● చాట్రాయి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చీపురుగూడెంలో ప్రధాన రహదారి జలమయమైంది. కచ్చా డ్రైన్లు పూడిపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచి అపరిశుభ్రత తాండవిస్తోంది. గ్రామంలోని వర్షపు నీరు మొత్తం దళితవాడ మీదుగా వెళుతుందని, మళ్ళీ జ్వరాలు వ్యాప్తిచెందే ప్రమాదం ఉందని, దళితవాడ వాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో కచ్చాడ్రైన్‌ల పూడిక తీయించి, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్షాలపై డీఈవో ఆరా

ముదినేపల్లి, జూలై 18 : భారీ వర్షాల కారణంగా పాఠశాలల నిర్వహణకు ఎదురయ్యే ఇబ్బందులను తన దృష్టికి తీసుకురావాలని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం, ఎంఈవోలు, హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. వర్ష తీవ్రత వల్ల శుక్రవారం లోకల్ హాలిడే ప్రకటించాలని ఏపీటీఎఫ్ నాయకులు డీఈవోను కోరిన నేపథ్యంలో పై సమాచారాన్ని కోరారు. పాఠశాలల నిర్వహణకు ఆటంకాలు ఎదురైతే తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈవో పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధలు పాటించండి

చాట్రాయి, జూలై 18: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి నారు మళ్ళు, నాట్లు వేసిన పొలాల్లో నష్టం జరగకుండా తగిన యాజమాన్య పద్ధతులను పాటించాలని, వ్యవసాయ అధికారి శివశంకర్ గురువారం సూచించారు. నారుమడుల్లో వర్షం నీరు నిలిస్తే కాలువల ద్వారా బయటకు పంపాలని, ఎక్కువ రోజులు నీట మునిగితే గాలి తగిలేలా చేసుకుని ఐదు సెంట్ల నారుమడికి కేజీ యూరియా, కేజీ పొటాష్ వేసుకుంటే సమస్యను అధిగమించవచ్చన్నారు. ఒక లీటరు నీటికి ఒక గ్రాము కార్బన్‌డిజమ్, ఒక గ్రాము మాంకోజబ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఒకవేళ వరినాట్లు వేసి పిలక దశలో ఉంటే నీటిని బయటకు పంపి, ఒక ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకోవడం ద్వారా మొక్కలు ముంపు ప్రభావం నుంచి తట్టుకుంటాయన్నారు.



ఎంఏవో శివశంకర్

హెల్మెట్‌ధారణతోనే ప్రాణానికి రక్షణ

నూజివీడు, జూలై 18: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తూ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్ పర్సన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్ల ఎంతో మంది మరణిస్తున్నారన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు హెల్మెట్ ధరించాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే పెదకాశీం, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కె.హరిబాబు, న్యాయధికారులు వి.వెంకటేశ్వరరావు, ఎం.శివపార్వతి, కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇందుపల్లి సత్యప్రసాద్, మధురవిశంకర్, భారత్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, బసవరాజు, రామకృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్ : రహదారి భద్రతా నిబంధనలు అనుసరించి విద్యార్థులు వాహనాలను నడపాలని నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య సూచించారు. నూజివీడు సిద్ధార్థ జూనియర్ కళాశాలలో హెల్మెట్ ధారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడిపినా, హెల్మెట్ ధరించకపోయినా శిక్షార్హులవుతారని హెచ్చరించారు. కళాశాల డైరెక్టర్ జి.రఘుబాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి నాగశైలజ

● కైకలూరు : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శివకిరణ్ అన్నారు. మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో హెల్మెట్ దారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేంపాటి సాయి సత్యనారాయణ, న్యాయవాదులు పి.పవన్‌కాంత్, అడగర్ల రాంబాబు, ప్రసన్నకుమార్, మేడిశెట్టి పాములు, బోడావుల ఇందిర పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆషాఢం సారె



పోలేరమ్మకు ఆషాఢం సారెను సమర్పిస్తున్న మహిళలు

కలిదిండి, జూలై 18 : భాస్కరావుపేట గ్రామ దేవత పోలేరమ్మకు మహిళలు గురువారం ఆషాఢం సారెను సమర్పించారు. మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని పాడిపంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. గ్రామ పెద్దలు దుగ్గిరాల శత్రుఘ్నుడు, పోకల దుర్గా ప్రసాద్, వీరబ్రహ్మం, దుగ్గిరాల ప్రసాద్, పోకల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి పాఠశాలలో శిక్షా సప్తాహ్

ముదినేపల్లి, జూలై 18 : ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 28 వరకు 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాలను నిర్వహించాలని విద్యాశాఖ కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం పాఠశాలల్లో రోజు వారీ అమలు చేయాల్సిన కార్యక్రమాలను ప్రకటించారు. 22న స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన, 23న పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్రం, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం, 24న విద్యార్థులకు క్రీడా పోటీలు, 25న సాంస్కృతిక కార్యక్రమాలు, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం జరపాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ శిక్షా సప్తాహ్ ద్వారా విద్యార్థులో బోధన, నైపుణ్యం, పరిసరాల పరిశుభ్రత, సమాజంపై అవగాహన పెంపొందించేందుకు ఉపాధ్యాయులు పల కార్యక్రమాలను నిర్వహిస్తారు. అంతేకాక బడిఈడు పిల్లలను నూరు శాతం బడిలో చేర్పించేందుకు ప్రోత్సహించే విధంగా కూడ ఈ కార్యక్రమాలు దోహదపడేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాల్సి ఉంటుంది. చివరి రోజున విద్యార్థులతో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీలు సహపంక్తి భోజనాలు నిర్వహించాల్సి ఉంటుంది.

టీచర్స్ కో ఆపరేటివ్ డైరెక్టర్‌గా నారాయణ

కలిదిండి, జూలై 18 : గుడివాడ టీచర్స్ కో ఆపరేటివ్ డైరెక్టర్‌గా కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో సోషల్ టీచర్ తైలం నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఛైర్మన్ మాదవ్ కుమార్, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొర్రా శ్యామ్ సుందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంబూరి భాస్కర వర్మ, కలిదిండి మండల గౌరవ అధ్యక్షుడు నున్న శ్రీనివాస్, అధ్యక్షుడు కాలారి శ్రీనివాస్ కైకలూరు మండల అధ్యక్షుడు వడ్డి శ్రీనివాస్, కార్యదర్శి అక్బర్ హుస్సేన్, కార్యవర్గ సభ్యులు డి.రవికుమార్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యా యులు నారాయణకు అభినందనలు తెలిపారు.



నారాయణకు అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మిషన్ శక్తిపై అవగాహన

నూజివీడు టౌన్, జూలై 18: బాల్య వివాహాలు చేస్తే వివాహం చేసుకున్న వరుణికి ఏడేళ్లు, తల్లిదండ్రులకు రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని నూజివీడు సీడీపీవో ఎస్.నూరాని అన్నారు. నూజివీడులో మిషన్ శక్తిలో భాగంగా గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల నిషేధం, పీఎం మాతృత్వ వందన యోజన, ఉజ్వల హోమ్స్ తదితర అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై పూర్తి నిఘా ఉండాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో నూరాని

ఉత్తమ బోధనలు అందించాలి

ముసునూరు, జూలై 18: బాలికలకు ఉత్తమ బోధనలు అందించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని, మండల విద్యాశాఖ అధికారి బీవీ సుబ్బారావు అన్నారు. ముసునూరు గురుకుల బాలికల పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న ఆహారం, మంచినీటి సరఫరా ట్యాంకులు, మెనూ, హాజరును ఆయన తనిఖీ చేసి అనంతరం విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ కె.ప్రవీణకు పలు సూచనలు చేశారు.

కేంద్ర రాజకీయాల్లో కీలక వ్యక్తిగా పవన్

నూజివీడు టౌన్, జూలై 18: కేంద్ర రాజకీయాల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలకం కానున్నట్లు నూజివీడు జనసేన సమన్వ యకర్త బర్మా ఫణిబాబు అన్నారు. నూజివీడు నియోజకవర్గంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడుతూ మీడియాపై వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయ సాయి రెడ్డి చేసిన వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. ఇదే పరిస్థితి ఉంటే వైసీపీ నాయకులను జనం తరిమికొట్టడం ఖాయమన్నారు. జనసేన క్రియాశీలక సభ్యత్వాలను విజయ వంతం చేయాలన్నారు. నాయకులు జితేంద్ర, కస్తూరి రాము, నాగబాబు, బొబ్బిలి శ్రీకాంత్, తోట వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఫణిబాబు

● చాట్రాయి : నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు ఆధ్వర్యంలో మండలంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు ఇళ్లకు వెళ్లి పార్టీ సభ్యత్వాలను యాప్‌లో నమోదు చేశారు. నాయకులు మాట్లాడుతూ రూ.500తో సభ్యత్వం తీసుకుంటే రూ. ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని, 18 నుంచి 70 ఏళ్ల వారు అర్హులన్నారు. మండల జనసేన ఉపాధ్యక్షుడు తుమ్మల జగన్, నాయకులు తగరం సురేష్, దుర్గాప్రసాద్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాలు మండల పార్టీ కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, నాయకులు మోటేపల్లి హనుమ, మట్లపూడి మదన శివకుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. తొలి రోజు 800 మంది సభ్యత్వాలు తీసుకున్నారు. సభ్యత్వాలు తీసుకున్న వారికి కలిగే ప్రయోజనాలను నాయకులు వివరించారు.

నేర సమాచారం

ఆత్మహత్యాయత్నం పై విచారణ

నూజివీడు, జూలై 18: స్థానిక సబ్‌జైల్లో ఖైదీ ఆత్మహత్యాయత్నం సంఘటన పై జైలు శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరరావు నూజివీడు సబ్‌జైల్లో గురువారం విచారణ నిర్వహించారు. వివరాల్లోకి వెళితే హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కొట్లాట కేసులో ఆకునూరి రాజేష్ అనే నిందితుడు నూజివీడు సబ్ జైల్లో ఉన్నాడు. ఈ క్రమంలో తోటి ఖైదీలు అనుచితంగా మాట్లాడారని బుధవారం రాత్రి మరుగుదొడ్లు శుభ్రపరిచే రసాయనం సేవించి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. దీన్ని గుర్తించిన సబ్ జైల్ సిబ్బంది రాజేష్‌ను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో సబ్‌జైల్ అధికారి ఉమామహేశ్వరరావు, నూజివీడు సబ్ జైల్లో సంఘటనకు సంబంధించిన అంశమై విచారణ నిర్వహించారు. జైల్ సూపరింటెండెంట్ గంగినేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో ఇరు వర్గాల పై కేసు

ముసునూరు, జూలై 18: భూసరిహద్దు వివాదంలో ఇరువర్గాలు పరస్పర దాడులు చేసుకున్న నేపథ్యంలో ఆరుగురి పై ముసునూరు పోలీసులు గురువారం కేసులు నమోదు చేశారు. ఎస్సై పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుళ్లపూడికి చెందిన యలమెల్లి వెంకటేశ్వరరావు, అతని తమ్ముడు సుబ్బారావుకు చెందిన పొలం సరిహద్దును అదే గ్రామానికి చెందిన చీపు వెంకటేశ్వరరావు కొంత మేర ఆక్రమించాడు. ఈ నెల 16వ తేదీన సరిహద్దు వివాదం పై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణ కాస్త దాడికి దారి తీయడంతో ఇరువర్గాలు కర్రలతో ఒకరి పై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనలో ఇరు వర్గాల వారికి గాయాలు కావడంతో నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఇరువర్గాలకు చెందిన యలమెల్లి వెంకటేశ్వరరావు, సుబ్బారావు, లక్ష్మితో పాటు చీపు వెంకటేశ్వరరావు, చీపు లక్ష్మి, అరుణకాంత్‌పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముంపులో కుమ్మరివారి జజారు

నీట మునిగిన ఇళ్లు

ముసునూరు, జూలై 18: రమణక్కపేటలో కుమ్మరివారి బజారులో నివాస గృహాలు వర్షానికి నీట మునిగాయి. వర్షపు నీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్ట లేదు. ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రి కొలుసు పార్థసారథి ఇటీవల ఇచ్చిన ఆదేశాలను సైతం అధికారులు బేఖాతారు చేశారు. గురువారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కుమ్మరివారి బజారులో సుమారు 25 ఇళ్లు నీట మునిగాయి. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండడంతో నీటి చెమ్మకు గోడలు నాని పోయి ఇళ్లు కూలిపోయే పరిస్థితి నెలకొందని స్థానిక నివాసితుడు వల్లూరి చిరంజీవి ఆందోళన వ్యక్తం చేశారు. రెండేళ్ల నుంచి ఇదే పరిస్థితి.. వర్షం వస్తే నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదంటున్నారు. డ్రైనేజీతో పాటు చెరువు భూమి సైతం వైసీపీ నాయకుడు ఆక్రమించుకుని డ్రైనేజీకి అడ్డుగా మట్టితో కట్టపోసి, చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో ఈ పరిస్థితి నెలకొందని చిరంజీవి ఆరోపించారు. దీనిపై రెండేళ్లుగా ఉన్న తాధికారులకు మండల స్థాయి అధికారులకు అర్జీలు అందజేస్తున్నా, నేటికి సమస్య పరిష్కరించ లేదన్నారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీలు పరిశీలించి మోటార్ల ద్వారా నీటిని తొలగిస్తామని చెప్పి వెళ్లారే తప్ప శాశ్వత చర్యలు చేపట్టలేదన్నాడు. వారం రోజుల క్రితం స్థానిక టీడీపీ నాయకులు, స్థానికుల మంత్రి పార్థసారథిని కలిసి సమస్య వివరించారు. ఎంపీడీవో సీహెచ్ పద్మా వతిదేవి, ఈవోపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు సమస్య పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆక్రమణదారుడు సర్వే చేసి ప్రభుత్వ భూమి ఉంటే తీసుకోమని అడ్డుపడడంతో రెవెన్యూ, పంచాయతీల ఆధ్వర్యంలో మూడు రోజుల క్రితం సర్వే నిమిత్తం నోటీసులు జారీ చేశారు. ఈ సర్వే గురువారం జరగాల్సి ఉండగా, వర్షం కారణంగా నిలిచిపోయింది. ఇళ్ల చుట్టూ మోకాలి లోతు ఉన్న వర్షపునీటిని తాత్కాలికంగా తొలగించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇళ్లు కూలితే అధికారులే బాధ్యత తీసుకోవాలని అన్నారు.



ఇళ్ల చుట్టూ ఉన్న వర్షపు నీరు

మాంసం దుకాణాలు తనిఖీ

నూజివీడు టౌన్, జూలై 18: మాంసం విక్రయాలు చేసే దుకాణదారులు పరిశుభ్రతను పాటించాలని నూజివీడు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు సూచించారు. భారీ వర్షాలు కురుస్తుండడంతో మాంసం విక్రయ దుకాణాలను ఆయన గురువారం పరిశీలించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు.



మాంసం దుకాణదారునికి సూచనలు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

వంతెన కూలి మూడేళ్లు గడిచినా..

ముదినేపల్లి, జులై 18 : శిథిల మైన పురాతన వంతెనలు కూలిపోతున్నాయి. నిధుల కొరత పేరుతో వాటి పునర్నిర్మాణం జాప్యం జరుగు తుంది. గ్రామీణులు మాత్రం అనేక వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. దాకరం - పుట్ల చెరువు ఆర్ అండ్ బీ రహదారిలో పేరూరు వద్ద పోల్ రాజ్ మేజర్ డ్రైన్‌పై వంతెన కూలిపోయి మూడేండ్లు గడిచినా నేటికీ పునర్నిర్మాణం జరగలేదు. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుంటున్నా ఎవరూ పట్టించుకోక పోవడంతో ఆకస్మాత్తుగా కూలిపోయింది. ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాల రాకపోకలకు మాత్రమే సామర్థ్యం కలిగి ఉన్నా ఈ వంతెనపై 2021 మార్చి 21న భారీ లోడు లారీ వెళ్లే ప్రయత్నం చేసిన సమయంలో కూలిపోయింది. అప్పట్లో శ్లాబు స్థానంలో రైతులు స్వచ్ఛందంగా ఐరన్ ప్లేట్లు ఏర్పాటు చేసుకుని ద్విచక్ర వాహనాల రాకపోకలకు మార్గం ఏర్పర్చుకున్నారు. ట్రాక్టర్లు వెళ్లే అవకాశం లేక ఆక్వా రైతులు, వరి రైతులు చెరువులకు, వ్యవసాయ భూములకు మేత, ఎరువులు తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం కొత్త వంతెన నిర్మాణానికి ఆర్ అండ్ బీ అధికారులు రూ.3.60 కోట్లకు ప్రతిపాదనలు పంపినా తీవ్ర జాప్యమైంది. నిధులు మంజూరు చేస్తూ ఇటీవల జీవో జారీ అయినా టెండర్ల ప్రక్రియ జరగలేదు.



పేరూరు వద్ద మూడేళ్ల క్రితం కూలిన వంతెన

చర్యలు తీసుకుంటున్నాం

పేరూరు వద్ద పోల్ రాజ్ మేజర్ డ్రైన్‌పై కొత్త వంతెన నిర్మాణానికి రూ.3.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. డీపీఆర్ టెండర్లకు ప్రయత్నిస్తున్నాం. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాక ఎస్టిమేట్లు వేస్తాం.

- విజయ శ్రీకర్, డీఈఈ, ఆర్ అండ్ బీ, కైకలూరు

భీమవరంలో బియ్యం వ్యాపారి అదృశ్యం

భీమవరం క్రైం, జూలై 18 : స్థానిక 18వ వార్డు గులాబీ సెంటర్‌లో నివాసం ఉండే గొంట్ల వెంకటనారాయణ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట హోల్‌సేల్ బియ్యం దుకాణం నడుపుతుంటారు. ఎప్పటిమాదిరిగా బియ్యం తాలూకా బకాయిల కోసం భీమవరం మండలంలోని పలు గ్రామాలకు ఈనెల 17వ తేదీన వెళ్ళారు. రాత్రి పది గంటలైన ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు, భార్య అన్నిచోట్ల వెతికారు. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు. 18వ తేదీ తెల్లవారుజాము నుంచి సెల్‌ఫోన్ పని చేయకపోవడంతో వ్యాపారి భార్య లక్ష్మీనారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

గంగానమ్మ గుడిని ఢీకొట్టిన లారీ

ఏలూరు క్రైం, జూలై 18 : అతివేగంగా వెళుతున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గంగానమ్మ గుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గుడి ప్రహరీ కూలి గోడలు కొంతభాగం దెబ్బతిన్నాయి. లారీ డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. ఏలూరు నుంచి మాదేపల్లి రోడ్‌లో గురువారం ఉదయం వెళుతున్న చేపల మేత కంటైనర్ లారీ అదుపుతప్పి మాదేపల్లిలోని గంగానమ్మ గుడిని ఢీకొంది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. లారీ డ్రైవర్, లారీ యజమాని కలిసి గుడి నిర్వాహకులతో చర్చలు జరిపి సమస్య పరిష్కరించినట్టు తెలుస్తోంది.